

# అమ్మకడుపు చల్లగా...

## – గొల్లపూడి మారుతీరావు



### (గత సంచిక తరువాయి)

**ఈ దశలో కొత్త కథ** కోసం నన్ను తరుచు ఆఫీసుకి తీసుకువెళ్ళి కూర్చోబెట్టేవారు తమ్మారెడ్డి కృష్ణమూర్తిగారు. మరొక గొప్ప మిత్రులు, కవి, గొప్ప స్నేహశీలి నార్ల చిరంజీవిగారు. ఆయనతో మా ఇంటికి వచ్చేవారు. రోజుల తరబడి ఆఫీసులో కూర్చున్నాం. కృష్ణమూర్తిగారికి పెద్దబ్బాయి లెనిన్ అంటే వల్లమాలిన అభిమానం. ఆయన తెలివితేటలకి మురిసిపోతూండేవారు. అది అందరి తండ్రులలోనూ కనిపించే అంశ. ఏతావాతా కథ యేమీ రాలేదు కాని నార్ల చిరంజీవిగారితో నా స్నేహం గట్టిపడింది. చర్చలు ఆగి స్నేహపూర్వకమయిన సమావేశాలు నార్ల చిరంజీవిగారింట్లో జరిగేవి. వారి శ్రీమతి అద్భుతమయిన వంట చేసి హార్దికంగా ఆదరించేవారు. (ఆతిథ్యమనగానే గుర్తుకు వచ్చే మూడు కుటుంబాలు, యిల్లాళ్ళు – నార్లవారు, నార్ల చిరంజీవిగారు, పుండరీకాక్షయ్యగారు) మంచి బీరు, మధ్యాహ్న బోజనం, సాహితీవ్యాసంగం, కబుర్లు అలా సాగి ఈ సాన్నిహిత్యానికి ఏదో రూపునివ్వాలని ఇద్దరం నిశ్చయించుకున్నాం. ఏం చెయ్యాలి? కలిసి ఓ నాటకం వ్రాయడానికి ఉపక్రమించాం. అయితే ఇద్దరూ కలిసి నాటకం వ్రాయడం ఎలా? ఆ సమస్య ప్రారంభించేనాటికి విడిపోయింది. ఇద్దరం కలిసి ఓ సన్నివేశం అనుకోడం, నేను వ్రాయడం, ఆయన చదవడం – అలా ఒక్క సీను సాగింది. ఆ నాటకం పేరు 'జీవితం'. ఇతివృత్తం గుర్తులేదు. ప్రస్తుతం వ్రాతప్రతి కూడా మిగలలేదు.

ఇప్పుడు మరొక్కసారి బదిలీ వచ్చిపడింది. నన్ను హైదరాబాదు నుంచి కదపాలనే ఢిల్లీ పట్టుదల ఇప్పటికి ఓ కొలిక్కి వచ్చింది. విజయవాడ బదిలీ చేశారు. మళ్ళీ వీడ్కోలు సభలు, విందులు ప్రారంభమయ్యాయి. ఈసారి న్యాపతి రాఘవరావుగారు నా మీద పాట రాశారు. దురదృష్టవశాత్తూ దాన్ని నా దగ్గర దాచుకోలేదు.

కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, ఎస్.వి.ఎస్ ప్రసాదరావుగారు నిజాం క్లబ్బులో మందు విందు ఇచ్చారు. ఆ సాయంకాలమే బుచ్చిబాబుగారు నా చెవిలో చెప్పిపోయారు – "అబ్బాయి, భోజనానికి ఇంటికి రా" అని.

ఆ మత్తులోనే బుచ్చిబాబుగారింటికి వెళ్ళాను. నా కోసం ఎదురు చూస్తున్నారు బుచ్చిబాబుగారు, శివరాజు సుబ్బలక్ష్మిగారు. వెన్నెలలాంటి చిరునవ్వుతో అత్యంత రుచికరమయిన విందు చేశారు ఆ యిల్లాలు. మాతో మరొక ప్రముఖులు ఆనాడు ఉన్నారు. ఆయన బారిష్టరు పార్వతీశం రచయిత మొక్కపాటి నరసింహశాస్త్రిగారు.

మొక్కపాటివారిని అంతకుముందు మరొక విచిత్రమయిన సందర్భంలో కలిశాను. 'ఆత్మగౌరవం' రిలీజయిన సంవత్సరమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నందీ బహుమతులను ప్రారంభించింది. అప్పటి సమాచార శాఖ సెక్రటరీ వి.వి. మాణిక్యాలరావుగారు. సినీ ప్రపంచానికి, ముఖ్యంగా మాకు సన్నిహితులు. నందీ అవార్డులు ఏం చెయ్యాలి, ఎలా ఇవ్వాలి అన్నీ చర్చిస్తూండేవారు. తోచిన సలహాలు యిస్తూండేవాళ్ళం, మొదటి అవార్డుల కమిటీలో కె.వి.గోపాలస్వామిగారు, ప్రఖ్యాత తమిళ నిర్మాత, అప్పటి మద్రాసు ఫిలిమ్ చాంబరు అధ్యక్షులు ఎ.ఎల్.శ్రీనివాసన్‌గారూ ఉన్నారు. నేనూ, యద్ధనపూడి సులోచనారాణి ఉత్తమ కథా రచయితలుగా (ఆత్మగౌరవం) అవార్డు గ్రహీతలం. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మనందరెడ్డిగారి చేతులు మీదుగా బహుమతిని అందుకున్నాం. ఆంధ్రప్రదేశ్ గవర్నరు పట్టం థానూ పిళ్ళై దంపతులు, బ్రహ్మనందరెడ్డి దంపతులు వేదిక మీద ఉన్నారు. హైదరాబాదులో అది చాలా గొప్ప గ్లామరస్ సభ. గాంధీభవన్ ఎగ్జిబిషన్ ఆవరణలో కన్నుల పండుగగా జరిగింది. అక్కినేని, రేలంగి, కాంచన, వి. మధుసూధనరావు, దుక్కిపాటి, కె. విశ్వనాథ్ ప్రభృతులంతా వేదిక మీద ఉన్నారు. ఇక సభలో ప్రముఖుల సంగతి సరేసరి. (నేను గవర్నమెంటు ఉద్యోగిని. సినిమా బహుమతిని అందుకోబోతున్నాను. అది నిబంధనలికి విరుద్ధం. మరి స్టేషన్ డైరెక్టరు అయ్యగారి వీరభద్రరావుగారు సభలోనే ముందు వరసలో. ఆ తర్వాతే నా బదిలీల పరంపర) కథా రచయితగా నన్ను ఉపన్యసించమన్నారు. ఆ రోజు నా ప్రసంగం చాలామంది అభినందనలు సంపాదించుకుంది. దుక్కిపాటిగారిని గురించీ, ప్రభుత్వాన్ని గురించీ, మాట్లాడాను. అంతా మంత్రముగ్ధులయి విన్నారు. కరతాళ ధ్వనులతో సభ దద్దరిల్లిపోయింది. సభ ముగిశాక అంతా వెళ్ళిపోయాక నేను మెల్లిగా వేదిక దిగుతున్నాను. ఒకే ఒక వ్యక్తి నాకోసం, నిలబడి ఉన్నారు. "ఉపన్యాసం బాగా చేశారు బాబూ" అని నన్ను అభినందించారు. ఆయన మొక్కపాటి నరసింహ శాస్త్రిగారు. ఆయన పేరు విని నేను తుళ్ళిపడ్డాను. మేమంతా ఆ రోజుల్లో బారిష్టరు పార్వతీశం భక్తులం. ఎవరు కారు.

మళ్ళీ ఇప్పుడు బుచ్చిబాబుగారింట్లో భోజనాలకి కలిశాం. బుచ్చిబాబు, సుబ్బలక్ష్మి, మొక్కపాటి, నేనూ నలుగురం రచయితలం ఆప్యాయంగా పంచుకున్న విందు అది. హైదరాబాదులో ఆఖరి విందు.

హైదరాబాదు నుంచి బయలుదేరి వెళ్ళేముందు ఒక అనుకోని సంఘటన.

మా నాన్నగారు ఉద్యోగం నుంచి రిటైరయారని తెలిసింది. వెంటనే బయలుదేరి విశాఖపట్నం వెళ్ళాను. ఉద్యోగం అయిపోయింది కనుక అందరినీ నా దగ్గరకి వచ్చెయ్యమన్నాను. అప్పటికి మా ఇద్దరి తమ్ముళ్ళ చదువులు జరుగుతున్నాయి. రావడానికి అభ్యంతరం తెలుపుతూనే రకరకాల కారణాలు చెప్పారు నాన్నగారు. ఏమయినా నాతో ఉండడానికీ, ముఖ్యంగా విశాఖపట్నం వదిలి రావడానికి ఆయన్ని ఒప్పించలేకపోయాను.

ఇదిలా ఉండగా తన భర్తకు లాయకీగా ఉంటుందని యద్దనపూడి సులోచనారాణిగారు చిక్కడపల్లిలో ఓ టైపు ఇన్‌స్టిట్యూట్ బేరం చేశారు. అంతకు ముందే. భర్తకి ఓ వ్యాసంగాన్ని కల్పించడం ఆమె ఉద్దేశం, చిక్కడపల్లిలో వెంకటేశ్వరస్వామి ఆలయానికీ, మెయిన్ రోడ్డుకీ మధ్యలో ఉండేది ఆ ఇన్‌స్టిట్యూట్. పది, పన్నెండు టైపు మిషన్లు – రోజంతా షిఫ్టుల్లో టైపు నేర్చుకునే పిల్లలు వచ్చిపోయేవారు. అదీకాక టైపు పనులు వస్తే డబ్బు తీసుకుని ఆ పని చేసి పెట్టేవారు.

నాకు విజయవాడ బదిలీ కాకముందు ఈ ఇన్‌స్టిట్యూట్‌ని మా నాన్నగారి కోసం కొంటే బాగుంటుందని నాకనిపించింది. మా నాన్నగారు పీట్‌మాన్ షార్ట్‌హ్యాండ్ సొసైటీలో సభ్యులు. అద్భుతంగా షార్ట్‌హ్యాండ్ రాసేవారు. అంతే అద్భుతంగా టైపింగ్ చేసేవారు. రిటైరయిన వయస్సులో యిలాంటి ఇన్ స్టిట్యూట్ చేతికి వస్తే వ్యాపకమూ, ఆదాయమూ ఉంటుందని నాకు తోచింది. దుక్కిపాటిగారు పూనుకుని ఈ ఆలోచన బాగుందన్నారు. మేమిద్దరం వెళ్ళి ఇన్‌స్టిట్యూట్ చూశాం. నాకు నచ్చింది. మా నాన్నగారికి ఉత్తరం రాశాను. ఆయన వచ్చారు. ఇన్‌స్టిట్యూట్ చూశారు. బహుశా ఓ రోజంతా అక్కడ కూర్చున్నారేమో గుర్తులేదు.

ఈలోగా నా బదిలీల ప్రకరణం ప్రారంభమయింది. ఓ సాయంకాలం మా నాన్నగారు తేల్చి చెప్పేశారు. ఈ వయస్సులో కొత్త వ్యాసంగం ప్రారంభించడం ఇష్టంలేదనీ, రోజంతా ఇన్‌స్టిట్యూట్‌ని నడపడం శ్రమగా ఉంటుందని. వ్యాపారమూ, తన కృషితో డబ్బు ఆర్జించడమూ  ఇలాంటి పనులు నాన్నగారికేనాడూ అలవాటు లేదు. అరవై దాటాక ఎప్పుడూ లేని కొత్త అలవాటునీ అంతకు మించి వ్యాపారాన్ని ప్రారంభించమనడం మంచిది కాదు. ఈ మాట దుక్కిపాటి అంగీకరించారు. ఈ కారణంగానయినా నా దగ్గర ఉంటారేమోనన్న ఆశ ఇలా తీరకుండా పోయినందుకు చాలా బాధపడ్డాను. అయినా చేసేదేమీ లేదు. ఇన్‌స్టిట్యూట్‌ని అప్పటికి నా దగ్గరున్న ఆదాయంతో కొనగలనే కాని – దాని మీద మనస్సులేని నాన్నగారితో పని చేయించలేను. నాన్నగారు విశాఖపట్నం వెళ్ళిపోయారు.

ఈలోగా రాంచీ బదిలీ, కటక్ బదిలీ, దుక్కిపాటిగారితో దక్షిణాది యాత్రా. 'పూలరంగడు' షెడ్యూలు రచనా, మధ్య మధ్య వీడ్కోలు విందులు ఇన్ని విషయాలు జరిగిపోతున్నాయి.

ఇక కొద్దిరోజుల్లో నేను విజయవాడ బయలుదేరాలి. మా ఆవిడ పిల్లలతో హనుమకొండ వెళ్ళింది. ఇక్కడ అసలు కథ ప్రారంభమయింది.

తెల్లారి  లేస్తే "పూలరంగడు" షూటింగ్ ముహూర్తం. సీన్లు చర్చించో, సవరించో దుక్కిపాటిగారితో ఓ సాయంకాలం సికింద్రాబాదు నుంచి హైదరాబాదుకి వస్తున్నాను కారులో. ఉన్నట్టుండి సులోచనారాణిగారి టైపు

ఇన్‌స్టిట్యూట్ ప్రసక్తి వచ్చింది. ఆయన ఆమె వ్యవహారాలను పూనుకుని సంధానకర్తగా ఉంటుండేవారు. నామీద అనుకోకుండా విరుచుకుపడ్డారు "మీరు నేడో రేపో విజయవాడ వెళ్ళిపోతున్నారు. ఆ ఇన్‌స్టిట్యూట్ గురించి సులోచనారాణితో ఏ విషయం తేల్చి చెప్పలేదు. చేసేదీ, చెందేదీ ఆమెకి తెలియచెప్పాలి కదా? అంత బాధ్యత లేకపోతే ఎలాగ?" ఇలా సాగింది ధోరణి.

ఎప్పుడూ లేనిది మొదటిసారిగా నాలో ఆవేశం తన్నుకొచ్చింది. ఉద్రేకంగా బడబడా ఎదిరించాను. "నన్ను ఇన్నాళ్ళూ చూశారు. నా గురించి మీరు ఇంతేనా తెలుసుకున్నది? ఏ రోజూ తీరికలేకుండా ఏదో పనులు చేస్తున్నాను. మీకు చేసి పెడుతున్నాను. ఇంకా హైదరాబాదు వదిలి వెళ్ళిపోలేదు. ఆమెని కలుసుకోకుండా మాట్లాడకుండా వెళ్ళిపోతాననుకున్నారా? నా మీద అంత నమ్మకం లేకపోతే నేను పని చేయలేను" అన్నాను. కారు టాంక్‌బండ్ నుంచి బషీర్‌బాగ్ వేపు తిరిగింది. గగన్‌మహల్ రోడ్డు దగ్గరకి వచ్చేసరికి డ్రైవరు నారాయణతో "కారు ఇంటికి తిప్పు" అని గద్దించాను. దుక్కిపాటిగారు ఏమీ మాట్లాడలేదు. దోమల్‌గూడాలో నా ఇంటి దగ్గర కారు దిగిపోయి యింట్లోకి వెళ్ళిపోయాను ఏమీ మాట్లాడకుండా కారు తలుపు దఢాల్న మూసి. అప్పటికి సాయంకాలం ఏడు దాటి ఉంటుంది.

దుక్కిపాటిని ఎదిరించానేగాని ఎదిరించినందుకు కాళ్ళూ చేతులూ వణికిపోయాయి. గుండెల్లోంచి దుఃఖం పెల్లుబికింది. ఇది కలలోనయినా ఆయన ముందు చేసేపని కాదు. ఆయన సాధింపు చేయించింది. అయినా జరగనిదేదో జరిగిపోయింది. బాధతో అనుచితంగా ప్రవర్తించినందుకు పశ్చాత్తాపంతో కృంగిపోయాను.

ఇంట్లో నేనొక్కడిని. ఉన్నట్టుండి బయట భోరున వర్షం ప్రారంభమయింది. ఎక్కడికి వెళ్ళడానికి, భోజనం చెయ్యడానికి అవకాశంలేదు. నిజానికి దృష్టి అటువేపు లేదు. అలాగే పడుకున్నాను. ఆలోచనల్లో మునిగి తేలుతూ. అలా ఎంతసేపు గడిచిందో తెలియదు.

ఉన్నట్టుండి ఎవరో తలుపు కొట్టిన శబ్దం వినిపించింది. మగత నిద్రలోంచి తుళ్ళిపడి లేచాను. తలుపు కొడుతున్నారు. వర్షంభోరున కురుస్తూనే ఉంది. వెళ్ళి తలుపు తీశాను. పంచె మీదకి ఎత్తిపట్టుకుని – చేతిలో గొడుగుని మడిచి ఇంట్లోకి అడుగుపెట్టారు దుక్కిపాటి. అప్పుడు వాచీ చూశాను. రాత్రి 10.45. దిగ్భ్రాంతుడినయాను. ఏం మాట్లాడాలి? ఏమనాలి?

ఆయన ఆ శ్రమ నాకివ్వలేదు. "భోంచేశారా?" అన్నారు.

లేదని తలూపాను.

"ఇంత రాత్రి వరకు భోజనం చెయ్యకపోతే ఆరోగ్యం ఏమవుతుంది? బట్టలు వేసుకోండి" అన్నారు.

తండ్రి మాటకి తలవొంచిన అల్లరి కుర్రాడిలాగ బట్టలు వేసుకున్నాను. ఇద్దరం కారెక్కాం. సరాసరి హైదరాబాదు ఎయిర్‌పోర్టులోకి వచ్చాం. అప్పటి బేగంపేట ఎయిర్‌పోర్ట్ ఇది కాదు. రామచంద్రాపురం వేపు తిరిగి వెళ్ళే పాత ఎయిర్‌పోర్టు.

ఆయన సాయంకాలం సంఘటన జరగనట్లే మాట్లాడుతున్నారు. నాకు మళ్ళీ పోగొట్టుకున్న డిగ్రీ చేతికి వచ్చినట్టుంది. నేను మాట్లాడుతున్నాను. ఎయిర్‌పోర్టులో నాకు భోజనం పెట్టించారు. మర్నాటి షూటింగ్‌కి దర్శకులు ఆదుర్తి సుబ్బారావుగారు రావలసిన విమానం రావడం ఆలస్యమయింది. ఏ పదకొండున్నరకో ఆదుర్తి దిగారు. ఆయన్ని ఎక్కించుకున్నాం. ముగ్గురం కారులో వచ్చినతరువాత దోమల్‌గూడాలో నన్ను దింపారు.

"ఉదయం ముహూర్తానికి కారు వస్తుంది రెడీగా ఉండండి" అని చెప్పి కారు తలుపు మూసుకున్నారు దుక్కిపాటి.

వాన వెలిసింది. తేలికయిన మనస్సుతో ఇంట్లో అడుగుపెట్టాను. దుక్కిపాటిగారి పశ్చాత్తాపమూ, క్షమాపణ చెప్పడమూ విలక్షణంగనే సాగింది. ఈ సంఘటన నేనెప్పుడూ మరిచిపోలేదు.

ఒకరిపట్ల ఒకరిగి గౌరవాలు – ఆయన 94వ యేటివరకూ ఏ మాత్రం బెసగకుండానే నిలిచాయి.

తర్వాత మరి వారం పది రోజుల్లో సకుటుంబంగా విజయవాడ బయలుదేరాను.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments